

నుజ్జునుజ్జు అయిన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

అతి వేగంతోనే..

- హొస్కోటె బస్సు ప్రమాదంపై పోలీసుల నిర్ధారణ
- నిద్రలోనే ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులు

హొస్కోటె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అతివేగం ఏకంగా ఐదుగురిని బలి గొంది. తిరుపతి నుంచి బయల్దేరిన ఆర్టీసీ బస్సులో ప్రయాణికులంతా కునుకుతీస్తున్న వేళ భారీ శబ్ధంతో ఉలిక్కిపడ్డారు. అప్పటికే బస్సులో ఓ భాగం తెరుచుకుపోయింది. ప్రయాణీకుల ఆర్తనాదాలు మిన్నంటాయి. చిత్తూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి బెంగళూరుకు వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున సుమారు 2 గంటలకు బెంగళూరు నగర శివారులో హొస్కోటె గొట్టిపురక్రాస్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న పైపుల లారీని వెనుకనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు వేగంగా దూసుకెళ్లి ఢీ కొట్టింది. బస్సు సగానికిపైగా తెరుచుకుపోయింది. ప్రమాదంలో చిత్తూరు జిల్లా ఆలమడుగుకు చెందిన కేశవులురెడ్డి (44), ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరుకు చెందిన తులసి (22)లు అక్కడికక్కడే మృతి చెందారు. తిరుపతికి చెందిన హరిబాబు కుమార్తె నాలుగేళ్ల ప్రణతి ఐసీయూలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆలమడుగుకు చెందిన గిరిజా, జనార్ధనరెడ్డి దంపతుల ఏడాదిన్నర కుమార్తె మృతి చెందారు. ప్రమాదం విషయం తెలియగానే తిరుపతి, చిత్తూరు, బెంగళూరులనుంచి ఆర్టీసీ అధికారులు హుటాహుటిన బయల్దేరారు. హొస్కోటె సమీపంలోనే ప్రమాదం జరగడంతో స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు కొనసాగించారు. గాయపడ్డ బాధితులందరినీ సమీపంలోని సిలికాన్ సిటీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో బెంగళూరు జేపీనగర్‌లో నివసించే శారదా (43)కు కుడికాలు పూర్తిగా తొలగిపోయింది. ఆమె చికిత్స ఫలించక ఆసుపత్రిలో మృతి చెందారు. ఆర్టీసీ డ్రైవర్ వీఎల్‌కే కుమార్ తీవ్రమైన గాయాలతో కోమాలోకి చేరారు. అతడిని స్థానిక ఆసుపత్రిలో చికిత్సల తర్వాత ఉన్నతవైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో ఇద్దరు చికిత్సలు పొందుతుండగా మరో పదిమంది ఆసుపత్రిలో ఉన్నారు. బెంగళూరు గ్రామీణ ఎస్పీ సీకే బాబాతోపాటు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.



మీడియాతో మాట్లాడుతున్న బెంగళూరు గ్రామీణ ఎస్పీ సీకే బాబా

విఫలం..!

- అన్నదాతకు చేదునిచ్చిన మామిడి
- దారుణంగా పడిపోయిన ధరలు
- సింధూర కిలో రూ.6, బాదామి రూ.18, రసపురి రూ.15
- తీవ్ర నష్టాల్లో రైతులు
- తోతాపురికి చిత్తూరు ఫ్యాక్టరీల షాక్ .. కొనుగోళ్లు నిలిపివేసిన యజమానులు



శ్రీనివాసపుర మామిడి మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన పండ్లు

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పండ్లలో రారాజుగా పిలిచే మామిడి రైతులకు ఈ ఏడు నిరాశే మిగిలింది. మామిడి అంటే అందరికీ నోరూరిస్తుంది. కానీ సాగు చేసిన అన్నదాతకు మాత్రం ఈ ఏడాది చేదే మిగిల్చింది. రాష్ట్రానికి చెందిన మామిడికి దక్షిణభారత్‌లోనే కాదు ఉత్తరభారతావని అంతా డిమాండ్ ఉంటుంది. ప్రధానంగా గల్ఫ్ దేశాలతోపాటు పదులసంఖ్యలో విదేశాలకు ఏటా ఎగుమతి అవుతాయి. ఇలా డిమాండ్ ఉండడంతో రైతులు మామిడిపంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతూ వస్తున్నారు. ఏడాదికోసారి ఆశించినంత లాభాలు వస్తాయని, కొంతకాలం పర్యవేక్షిస్తే ఏటా పంట ద్వారా ఆదాయం వస్తుందని భావించారు. ఇలా దశాబ్దాలకాలంగా కొన్ని జిల్లాల్లో ప్రధానమైన పంటగా మామిడి సాగు చేస్తున్నారు. ఇటీవల కొన్నేళ్లుగా డ్రిప్ ఇరిగేషన్ విధానంతో తక్కువనీరు, తక్కువమంది కూలీలతో ఎక్కువ ఎకరాల్లో మామిడి పంట సాగు చేసేందుకు అనుకూలమైంది. విదేశాలకు ఎగుమతి చేసేందుకు విమాన సర్వీసులు, సముద్రమార్గం ద్వారా మంగళూరు, చెన్నై హార్బర్‌లు సమీపంలో ఉండడంతో మరింత కలిసొచ్చింది.

23 ఏళ్లలో కనిష్ఠ ధరలు..

రాష్ట్రంలో అన్ని రకాల మామిడి సాగు అవుతోంది. ప్రధానంగా అల్ఫాన్సా, సింధూర, మల్లికా, రసపురి, మల్‌గోవా రకాల ధరలు ఎక్కువగా ఉంటాయి. కోలారు, తుమకూరు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో తోతాపురి రకం విస్తారంగా సాగు చేస్తారు. 23ఏళ్లలో ఇంత తక్కువధరలు ఎప్పుడూ లేవని రైతులు వాపోతున్నారు. శ్రీనివాసపుర ఏపీఎంసీ మార్కెట్‌లో కేజీల లెక్కన సింధూర రూ.6, బాదామి రూ.18, మల్లికా రూ.15-25, రసపురి రూ.15, సక్కరగుత్తి రూ.30-40, కేసర్ లేదా దసేరి రకం రూ.20-30 పలుకుతోంది. రెండువారాలక్రితం అల్ఫాన్సా కిలో రూ.26 -33 పలికింది. ఇటీవల రూ.12నుంచి 14కు పడిపోయింది. సింధూర రూ.15-20 ఉండగా ఈ వారం రూ.4కు పడిపోయింది. 2003లో బాదామి కిలో రూ.8గా ఉండేది. అప్పటినుంచి అత్యంత తక్కువ అంటే రూ.12-14కు తగ్గిపోయింది. కోతకు వచ్చిన మామిడిని వెంటనే సేకరించకపోతే పండు దెబ్బతింటుంది. మార్కెట్‌లో ధర తక్కువ అని కోతలు కోయకుండా ఉండలేం, అలాగని వదులుకునే పరిస్థితి లేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉద్యాన శాఖ

రాష్ట్రంలో మామిడిరైతుకు అనుకూలం చేసేందుకు ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా మరిన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. ఇతర రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉన్నా రాష్ట్రంలో ఉద్యానవనశాఖకు అనుబంధంగా ఉండే 'హాప్ కామ్స్' ద్వారా రైతులు గిట్టుబాటుధరకు విక్రయించే వెసలుబాటు ఉంది. ఇక లాల్‌బాగ్‌లో ఏకంగా నెలరోజులపాటు మామిడిమేళా నిర్వహిస్తారు. రైతులకు ఎవరికీ కమీషన్‌లు ఇవ్వకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల ద్వారా రైతులు విక్రయించుకునే వెసలుబాటు ఉంది. మరోవైపు గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే)లోనూ ఏటా మామిడిపండ్ల ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. ఇక బెంగళూరులోని పలు మాల్‌లు కొత్తగా మామిడిపండ్లను విక్రయించే వెసలుబాటు కల్పించారు. ఇలా రైతుకు అన్ని విధాలా ప్రోత్సాహం ఉంది. 2024లో రాష్ట్రంలో సంతృప్తికరంగా వర్షాలు కురిశాయి. పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడులలో ముందుగానే పంట చేతికొచ్చేది. కర్ణాటకలో కాస్త ఆలస్యంగా మార్కెట్‌కు మంచి మామిడి వచ్చేది. గత ఏడాది సంతృప్తికరమైన వర్షాలు కురవడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండడంతో మార్కెట్‌లోకి అత్యధికంగా సాగు చేసే రాష్ట్రాలనుంచి మామిడి ఒకేసారి వచ్చింది. ఇది రాష్ట్ర రైతుపై తీవ్ర ప్రభావం చూపింది.



మామిడి కొనుగోళ్లు ఆపేయడంతో నిరసన చేపట్టిన రైతులు(ఫైల్)

ముందస్తు వర్షాలతో తీవ్ర ప్రభావం..

ఈ ఏడాది రాష్ట్రంలో ఎండలప్రభావం అంతగా లేదు. మార్చి ఆఖరు నుంచి ఏప్రిల్, మే నెలల్లో ఎండాకాలం ఉండాలి. అటువంటి సీజన్‌లో మామిడి కోతలు చేస్తే కనీసం వారం రోజులు నిల్వ ఉండేది. ఏప్రిల్, మే నెలల్లో నిరంతరంగా వర్షాలు కురవడంతో మామిడి కోసిన వెంటనే రెండు మూడు రోజుల్లోనే పండు కావడం, ఆ తర్వాత వృథా అవుతున్నాయి. నవంబరు, డిసెంబరులలో రైతులనుంచి మామిడిచెట్లను కాంట్రాక్టు పొందుతారు. ఓ చెట్టును బట్టి ధరను నిర్ణయిస్తారు లేదా పూతపిందె ప్రకారం ఎకరాలు, పంట రకాలనుబట్టి కొనుగోలు చేస్తారు. వాతావరణ వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది 40శాతం మాత్రమే మామిడి పంట పండిందని అంచనా వేశారు. దిగుబడి శాతం తగ్గినా ధరలు కూడా పడిపోవడం రైతులను దెబ్బతీసేలా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా 1.49 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి సాగు చేస్తారు. ఏటా 9-10లక్షల మెట్రిక్‌టన్నుల మామిడి దిగుబడి అవుతుంది. కేవలం కోలారు జిల్లాలో 46వేల హెక్టార్లలో మామిడి సాగు అవుతుండగా జిల్లాలోనే 4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడిగా ఉంది. జిల్లాలోని శ్రీనివాసపురంలో అధికంగా సాగు చేస్తారు. కోలారు తర్వాత రామనగర, తుమకూరు, చిక్కబళ్ళాపుర, ధారవాడ, బెళగావి జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ మామిడి సాగు చేస్తారు. అయితే అత్యధికంగా సాగు చేసే జిల్లాలు పదిదాకా ఉన్నాయి.

వివిధ రాష్ట్రాల నుంచి అధిక సరుకు..

ఏకకాలంలో వివిధ రాష్ట్రాల మామిడి ఒకేసారి మార్కెట్‌లోకి రావడంతోనే ధరలు పడిపోయాయని రైతులు వాపోతున్నారు. రిటైల్ మార్కెట్‌లో మాత్రం మామిడి వందకు తక్కువగా విక్రయించడం లేదు. అల్ఫాన్సా, సింధూర, మల్లికా, మల్‌గోవా రకాలు వందకుపైనే విక్రయిస్తున్నారు. కానీ రైతు నుంచి హోల్‌సేల్ వ్యాపారికి చేరాక రిటైల్ మార్కెట్‌లో అమ్ముడవుతుంది. విదేశాలకు ఎగుమతి తగ్గినట్టు తెలుస్తోంది.

చిత్తూరు ఫ్యాక్టరీల్లో తోతాపురి నిరాకరణ

రాష్ట్రంలో మామిడి ప్రధానంగా సాగు చేసే కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు జిల్లాలనుంచి తోతాపురి రకం గడిచిన కొన్ని దశాబ్దాలుగా సరిహద్దులోని చిత్తూరు జిల్లా జ్యూస్ ఫ్యాక్టరీలకు విక్రయించేవారు. ఏటా ఈ విధానం సాగుతోంది. గత ఏడాది ఉత్పత్తి చేసిన పల్ప్ పూర్తిగా విక్రయం కాకపోవడంతో ఈ ఏడాది ఫ్యాక్టరీలు కొనుగోలు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నాయి. పైగా చిత్తూరు జిల్లాలోనే విస్తారంగా మామిడి పంట దిగుబడి ఉండడంతో అక్కడి జిల్లా అధికారి పొరుగు రాష్ట్రాలనుంచి మామిడిని కొనుగోలు చేయరాదని ఫ్యాక్టరీలకు ఆదేశించా రు. ఈ ప్రభావం కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలపై పడింది. రాష్ట్రంలో ప్రతి మామిడి రైతుకు వారిస్థాయిని బట్టి లక్షలాది రూపాయలు నష్టం మిగిల్చింది.

పన్నులవాటా పెంచండి

- జీఎస్టీ వసూళ్లలో కర్ణాటక దేశంలోనే రెండో స్థానం
- మరిన్ని నిధులతోనే రాష్ట్రానికి న్యాయం
- కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌కు సీఎం వినతి



బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పన్నులవాటా పెంచాలని 16వ ఫైనాన్స్ కమిషన్‌ను సీఎం సిద్దరామయ్య విన్నవించారు. ఢిల్లీలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగరియాతోపాటు కమిషన్ సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం సీఎం కర్ణాటక భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కమిషన్ ముందు ప్రతిపాదించిన అంశాలను వివరించారు. దేశ ఆర్థిక ప్రగతిలో కర్ణాటక కీలకంగా వ్యవహరిస్తోందని, దేశంలో రాష్ట్ర జీడీపీ 8.7శాతంగాను, జీఎస్టీ వసూళ్లలో జాతీయస్థాయిలో రెండోస్థానంలో ఉందన్నారు. వనరుల కేటాయింపులో అసమానత ఉన్నట్లు కమిషన్‌కు వివరించామన్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లే పన్నుల్లో రాష్ట్రానికి రూపాయికి కేవలం 15పైసలు మాత్రమే వాపసు వస్తోందని వివరించామన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ 4.713 నుంచి 3.647 శాతానికి తగ్గించారన్నారు. తద్వారా 15వ ఫైనాన్స్ సిఫారసు ద్వారా 80వేల కోట్ల రూపాయలు నష్టమైనట్లు వివరించామన్నారు. వనరుల కేటాయింపులో 16వ ఫైనాన్స్ కమిషన్‌లో సర్దుబాటు చేయాలని వినతిని ఇచ్చామన్నారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య 50శాతంకు పన్నుల వాటా పెంచాలన్నారు. సెస్, సర్‌చార్జీలు 5శాతానికి పరిమితం చేయాలన్నారు. తలసరి ఆదాయం పంపిణీలో పెరుగుతున్న వ్యత్యాసాన్ని, ఆదాయం కొరత, గ్రాంట్లకు సంబంధించి తారతమ్యాన్ని సర్దుబాటు చేయాలన్నారు. కర్ణాటక ఆర్థిక ప్రగతిలో బెంగళూరు కీలకపాత్రగా ఉందని, నగరంలో మౌలిక సదుపాయాల బలోపేతానికి 1.15 లక్షలకోట్ల రూపాయల పెట్టుబడికి మద్దతు కోరారు. సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

నాటి నక్సల్స్ నియంత్రణ దళమే..

నేటి స్పెషల్ యాక్షన్ ఫోర్స్

- తీర జిల్లాల్లో మతఘర్షణలను నియంత్రించడమే లక్ష్యం
- దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేకదళం
- హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా నక్సల్స్‌ను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దళానికి సరికొత్త బాధ్యతలు అప్పగించారు. స్పెషల్ యాక్షన్ ఫోర్స్ (ఎస్‌ఏఎఫ్) పేరిట దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ, శివమొగ్గ జిల్లాల్లో మత ఘర్షణలు, మతపరమైన హత్యలను నియంత్రించే బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో చిక్కమగళూరు, తుమకూరు, శివమొగ్గ, దక్షిణకన్నడ జిల్లాల్లోని అటవీప్రాంతాలు నక్సల్స్‌కు స్థావరాలుగా ఉండేవి. కొన్నేళ్లకాలంగా నక్సల్స్ ప్రాబల్యం కొనసాగింది. పదేళ్ల వ్యవధిలో నక్సల్స్ ఉనికికి భంగం కలుగుతూ వచ్చింది. గత ఏడాదికి ఆరేడుమంది మాత్రమే నక్సల్స్ మిగిలారు. ఇటీవలే ఓ ఎన్‌కౌంటర్ జరగడంతో మిగిలిన నక్సల్స్ జనజీవన స్రవంతిలోకి వచ్చేశారు. ఇలా నక్సల్స్ పూర్తిగా లొంగిపోవడంతో రాష్ట్రంలో నక్సలైట్ల ప్రభావం పూర్తిగా కనుమరుగయ్యింది. అయితే నక్సల్స్ నియంత్రణ దళాన్ని పూర్తిగా రద్దు చేసి ఇతర విధులకు కేటాయించాలని ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణకన్నడ జిల్లాలో ఇటీవల మతపరమైన హత్యలు భయాందోళనకు కారణమయ్యాయి. వరుసగా ప్రతీకారాలు తీర్చుకునేలా ఇద్దరు ముస్లిం యువకులతోపాటు ఓ హిందూ కార్యకర్త హత్యకు గురయ్యాడు. వీరి హత్యల వెనుక మతపరమైన ప్రతీకారం ఉందని రుజువైంది. దీంతో సంపూర్ణంగా మత ఘర్షణలు నియంత్రించేందుకు స్పెషల్ యాక్షన్ ఫోర్స్‌ను శుక్రవారం హోం మంత్రి మంగళూరులో లాంఛనంగా ప్రారంభించారు. నక్సల్స్ నియంత్రణ దళాన్ని స్పెషల్ యాక్షన్‌ఫోర్స్‌గా మార్చారు. ఇదే విషయమై హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా మతఘర్షణల నియంత్రణకు ఎస్‌ఏఎఫ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తీరప్రాంత జిల్లాల్లో పూర్వవైభవం తీసుకురావాలని, శాంతిభద్రతలు పెంపొందింపచేయాలని భావించామన్నారు. దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ జిల్లాలతో పాటు శివమొగ్గలోనూ ఈ ఫోర్స్ పనిచేయనుందన్నారు. అవసరమైతే మరిన్ని జిల్లాలకు విస్తరిస్తామన్నారు.



ఎస్‌ఏఎఫ్ సిబ్బందితో హోంమంత్రి పరమేశ్వర్, డీజీపీ తదితరులు

ఎస్‌ఏఎఫ్‌లో మొత్తం సిబ్బంది ప్రస్తుతం 248 మంది ఉండగా మూడు కంపెనీలుగా విభజించారు. ప్రతి కంపెనీలో కనీసం 80మంది ఉంటారు. డీఐజీ, డీఎస్పీ, సహాయక కమాండెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు ఉంటారు. మంగళూరు పోలీస్ కమిషనర్ సుధీర్‌కుమార్‌రెడ్డికి ఎస్‌ఏఎఫ్ అదనపు బాధ్యతలు అప్పగించారు. నక్సల్స్ నియంత్రణ దళంలోని 656మందికిగాను ప్రస్తుతం 248మందిని ఎస్‌ఏఎఫ్‌లోకి తీసుకున్నారు.

16 నుంచి నగరంలో

బైక్‌ట్యాక్సీల నిషేధం

- హైకోర్టు ఆదేశం



బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బైక్‌ట్యాక్సీ నిషేధిస్తూ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలను కొనసాగించాలని దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తిరస్కరించింది. ఓలా, ఉబెర్‌తోపాటు బైక్ ట్యాక్సీ నిర్వాహకులు దాఖలు చేసుకున్న పిటిషన్‌పై శుక్రవారం విచారణలు జరిగాయి. ఏప్రిల్ 2న ఏకసభ్య ధర్మాసనం బైక్ ట్యాక్సీలను నిషేధిస్తూ తీర్పును ప్రకటించింది. సదరు తీర్పును రద్దు చేయాలని పిటీషన్ దాఖలు కాగా విచారణ జరిపిన ధర్మాసనం ఈనెల 15వరకు విస్తరింపచేశారు. అయితే మరోసారి గడువు విస్తరించాలని దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కామేశ్వరరావు, శ్రీనివాసరావుల ధర్మాసనం ఇరువర్గాల వాదనలు ఆలకించింది. గడువు కొనసాగించలేమని ధర్మాసనం తీర్పు అమలులోకి రావాల్సిందేనని తేల్చింది. దీంతో ఈనెల 16న సోమవారం నుంచి బెంగళూరుతో పాటు రాష్ట్రమంతటా బైక్‌ట్యాక్సీలకు బ్రేక్ పడనుంది.

చదివింపులు..!

- ప్రభుత్వ పాఠశాలలో చేరితే విద్యార్థి పేరుతో రూ. 1,111 డిపాజిట్..
- విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయుడి వినూత్న ఆలోచన

బళ్లారి గాంధీనగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వపాఠశాలకు ఆదరణ తగ్గిపోయి పాఠశాలలో విద్యార్థుల చేరిక గణనీయంగా తగ్గిపోవడంతో ఉపాధ్యాయులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. బెళగామ్ జిల్లా, అథిణితాలూకా కొట్టలగియ ప్రభుత్వ కన్నడ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత ఏడాది కొత్తగా చేరే విద్యార్థులకు తలా రూ 1,111 డిపాజిట్ చేయడానికి ముందుకు వచ్చాడు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఏబీ పాటిల్. మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్న కొట్టలగియ కర్ణాటక రాష్ట్రానికి చిట్టచివరి గ్రామం. ఈగ్రామంలో రెండు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మూడునాలుగు కిలోమీటర్ల విస్తీర్ణంలో కుంబార వసతి, బడవగోళి వసతి, కరేప్పగోళ వసతి, యల్లమ్మనగుడి వసతిలో నాలుగు తోట పాఠశాలలు ఉన్నాయి. ఒకే గ్రామంలో చుట్టూ ఇన్ని పాఠశాలలు ఉండగా, 1871లో ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఒకప్పుడు150 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలో 107కు తగ్గిపోయింది. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి పిల్లలపై డిపాజిట్ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు ముఖ్యోపాధ్యాయులు ఏబీ పాటిల్ తెలిపారు. ప్రస్తుతం 1 నుంచి 7వతరగతి ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. జూన్10వ తేదీ వరకు కేవలం 20మంది విద్యార్థులు పాఠశాలలో ప్రవేశం పొందారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 127కి చేరింది. స్థానిక పోస్టల్ కార్యాలయంలో విద్యార్థుల పేరుతో అకౌంట్ ఓపెన్ చేసి తలా రూ.1,111 డిపాజిట్ చేశారని, 18 సంవత్సరాల తరువాత డిపాజిట్ చేసిన మొత్తం విద్యార్థుల చేతికి అందుతుందని, ఆ మొత్తం వారి భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని పాటిల్ పేర్కొన్నారు. విద్యార్థులు ఇళ్ళవద్దకు వెళ్ళి తల్లిదండ్రులను ఒప్పించి ఇళ్ళలో ఉన్నపిల్లలను పాఠశాలకు తీసుకొస్తే పాఠశాల వార్షిక స్నేహ సమ్మేళనంలో "ఎన్‌రోల్‌మెంట్ హీరో" ప్రశస్తిని అందజేసి గౌరవిస్తున్నట్లు పాటిల్ తెలిపారు. దీంతో పాటు ఈ ఏడాది 127మంది విద్యార్థులకు రూ.40వేలు ఖర్చుచేసి ట్రాక్‌సూట్ అందజేస్తున్నట్లు పాఠశాల మరో ఉపాధ్యాయుడు సంగమేశ తెలిపాడు.



కొట్టలగియ గ్రామ పాఠశాలలో విద్యార్థులు

విమాన ప్రమాదంలో

మంగళూరు కో పైలట్

- డాక్టర్ కుందర్ చదివింది కర్ణాటకలోనే..



డాక్టర్ కుందర్ (ఫైల్)

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతుల కుటుంబాలది దీనావస్థ. సుఖంగా విమానంలో బయల్దేరారని భావిస్తున్న తరుణంలోనే ఘోర దుర్ఘటన జరిగింది. ప్రమాదానికి సంబంధించిన విమానానికి కో-పైలట్‌గా వ్యవహరించింది దక్షిణకన్నడ జిల్లా మంగళూరు వాసి కాగా రాజస్థాన్‌కు చెందిన డాక్టర్ కుందర్ కుటుంబం మృతి చెందిన విషయం తెలిసిందే. సదరు డాక్టర్ ఎంబీబీఎస్, పీజీ కర్ణాటకలోనే చదివారు.

మంగళూరుకు చెందిన క్లైవ్ కుందర్ కో-పైలట్ కాగా, ఫస్ట్ ఆఫీసర్‌గా కూడా ఉన్నారు. కుందర్ తల్లి రేఖా ఒకప్పుడు ఎయిర్ ఇండియాలో క్యాబిన్ క్రూ కాగా, తండ్రి క్లిఫర్డ్ కుందర్ ఉడుపి సమీపంలోని మల్పెకు చెందినవారు. వారు ఇటీవల కొన్నేళ్లక్రితం వలస వెళ్లారు. విమాన ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ ప్రతీక్‌జోషి రాజస్థాన్ రాష్ట్రం ఉదయపుర నివాసి, ప్రతీక్‌జోషి కుటుంబీకులంతా మృతి చెందారు. ప్రతీక్‌జోషి బెళగావిలోని కేఎల్‌ఈ విద్యాసంస్థల అనుబంధమైన జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం కోలారు దేవరాజ్ అరసు మెడికల్ కళాశాలలో రేడియాలజీ విభాగంలో పీజీ చదివారు.

కోర్టులో లొంగిపోయిన ఎమ్మెల్యే కులకర్ణి 7

చిక్కుల్లో మేయర్ ఎన్నికలు
- హుబ్లీ-ధార్వాడ రిజర్వేషన్లు మార్చాలని కోర్టుకు వెళ్లిన కార్పొరేటర్లు

8 శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి
- రైతు మేళా ప్రారంభోత్సవంలో కలెక్టర్

కమిటీ ఉండీ వృథా..!

వేసవి క్రీడా శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం

- శాప్ నిధులిచ్చినా.. ఖర్చు చేయని దుస్థితి
- సామగ్రి ఇవ్వకుండానే క్యాంపుల ముగింపు
- తక్కువ మందితో మమ అనిపించిన వైనం



డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో సమ్మర్ కోచింగ్‌లో క్రీడాకారులు (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు నియమించిన జిల్లాస్థాయి కమిటీ పట్టనట్లు వ్యవహరించింది. ఎక్కువ మందికి శిక్షణ అందించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. కనీసం వచ్చిన నిధులతో క్రీడాసామగ్రి కొనుగోలు చేసి, క్రీడాకారులకు ఇవ్వకుండా కాలయాపన చేసింది. క్రీడా శిబిరాలే ముగిసినా.. నేటికీ పంపిణీ చేయలేదు. క్రీడాసామగ్రే లేకుండా శిబిరాలు ముగించేశారంటే నిర్వహణ ఏస్థాయిలో సాగి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చారన్న విమర్శలు మూటగట్టుకున్నారు.

మమ అనిపించారు..

ఏటా వేసవిలో క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. గత వైసీపీ ప్రభుత్వం వాటిని అటకెక్కించింది. వేసవి శిబిరాల ఊసేలేకుండా చేసింది. కొత్త ప్రభుత్వం మళ్లీ వేసవి శిబిరాలు నిర్వహించాలని నిర్వహించింది. ఐదేళ్ల తరువాత ఈ ఏడాది వేసవిలో శిబిరాలు ఏర్పాటు చేశారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ)కి ఆదేశాలు అందాయి. నిర్వహణకు జిల్లాలో జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) కన్వీనర్‌గా, సభ్యులుగా పరిశ్రమల కేంద్రం జీఎం, డీఈఓను చేర్చారు. క్యాంపుల విషయాన్ని క్రీడాకారులకు తెలియజేయడంలోనే కమిటీ విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఒక్కో శిబిరంలో 50మంది క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో 15-25 మందితో సరిపెట్టేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వంద సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని శాప్ లక్ష్యంగా నిర్దేశించింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో వంద శిబిరాలకుగాను 2,600 మంది హాజరైనట్లు డీఎస్ఏ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.

శాప్ నిధులిచ్చినా..

ఉమ్మడి జిల్లాలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు శాప్ నిధులు మంజూరు చేసింది. ఒక్కో శిబిరానికి రూ.7 వేలు చొప్పున కేటాయించింది. ఇందులో రూ.5వేలు క్రీడాసామగ్రి, రూ.1,500 కోచ్‌కి గౌరవ వేతనం, రూ.500 బ్యానర్ ఇతర ఖర్చులకు వెచ్చించాలని ఆదేశించింది. నిధులు మంజూరు చేసి 25 రోజులైంది. సమ్మర్ కోచింగ్ క్యాంపులు కూడా ముగిశాయి. విచిత్ర మేమిటంటే నేటికీ క్యాంపునకు హాజరైన వారికి క్రీడాసామగ్రి అందజేయలేదు. 25రోజులు సమయం ఉన్నా కమిటీ నిర్లక్ష్యం కారణంగానే క్రీడాసామగ్రి అందజేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శాప్ మంజూరు చేసిన నిధులను పక్కదారి పట్టించే యోచనలో ఉన్నారనే ఆరోపణలు లేకపోలేదు.

ఆలస్యమైన మాట వాస్తవమే



నాణ్యమైన క్రీడాసామగ్రి తక్కువ ధరకే కొనుగోలు చేయాలని చేసిన ప్రయత్నంతో కొద్దిగా ఆలస్యమైంది. క్రీడాసామగ్రి కొనుగోలు చేసిన వెంటనే ఆయా శిబిరాల్లో సాధన చేస్తున్న వారికి అందిస్తాం. సమ్మర్ కోచింగ్ క్యాంపులు సజావుగా నిర్వహించాం.

- ఉదయ్‌భాస్కర్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

కొత్తచెరువు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని డీఈఓ కిష్టప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సత్యసాయి జిల్లాలో ఓపెన్ టెన్త్ పరీక్షలు 372 మంది రాయగా.. 243 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 65.32 శాతం ఉత్తీర్ణత నమోదయిందని వివరించారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు 774 మంది రాయగా.. 572 మంది ఉత్తీర్ణత సాధించడంతో 73.90 శాతం నమోదయిందని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ జవాబు పత్రాల రీ కౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీ వెరిఫికేషన్ (జవాబు పత్రం జిరాక్స్)కు ఒక సబ్జెక్టుకు రూ.1000 ఫీజు ఈనెల 25 తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు.

మళ్లీ సేంద్రియం వైపు...

సేంద్రియ సేద్యం వైపు రైతుల చూపు

దిగుబడులు పెరిగాయంటున్న కర్షకులు

కళ్యాణదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట మరచి పోయిన సేంద్రియ సాగు వైపు అన్నదాతలు ప్రస్తుతం మొగ్గు చూపుతున్నారు. రసాయన ఎరువుల వాడకంతో తడిసిమోపెడవుతున్న పెట్టుబడుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. వ్యవసాయశాఖ అధికారులు కూడా ప్రోత్సహిస్తుండటంతో రైతులు సేంద్రియ సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

భూసారం పెంపొందించుకునే దిశగా చర్యలు

రసాయనిక ఎరువులు ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. దీంతో భూసారాన్ని పెంపొందించుకునే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. గొర్రెలు, మేకలు, పశువుల పేడను పొలాలకు తోలుతున్నారు. పశువులు లేని రైతులు ఇతర ప్రాంతాల్లో ఎరువులు కొని పొలాలకు తరలిస్తున్నారు. రసాయనిక ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో ఆ ఎరువులు వాడే రైతులకు పెట్టుబడి పెరుగుతోంది. పైగా దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రైతులు సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు.

రెండు వేల హెక్టార్లకు పైబడి సాగు

ఖరీఫ్ కింద ప్రతి ఏటా నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రెండు వేల హెక్టార్లకు పైబడి వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. ఇందులో అంతర పంటలు కూడా సాగు చేస్తారు. ఇప్పుడు ఏ పంట సాగు చేయాలన్న మొదట సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. దీంతో పాటు కర్బూజా, కలింగర, టమోటా, గెనసగడ్డ, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వలన వ్యవసాయ ఖర్చులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.



పొలంలో కుప్పలుగా కనిపిస్తున్న సేంద్రియ ఎరువు

తక్కువ ఖర్చు



సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉంటోంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూమి గట్టి పడి పంటలకు రోగాలు ఎక్కువ వచ్చేవి. పశువుల పేడ వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం భూమిలో సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. అధిక పంట వస్తోంది. అందుకే ప్రతి ఏటా పశువుల ఎరువునే వాడుతా. పంటల దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది.

- రామాంజనేయులు, రైతు, కరిగానిపల్లి

అనేక లాభాలు

సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వాడకం వల్ల పంట పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. తేమ ఉండటం వలన చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్లు కూడా తక్కువే. రైతుకు తక్కువ ఖర్చు అధిక ఫలసాయం లభిస్తుంది.

- ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం డివిజన్

మంచి దిగుబడి



కర్బూజ, కళింగర పంటల సాగుకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. పంటలకు ఎటు వంటి తెగుళ్ల రాకుండా సేంద్రియ ఎరువులు బాగా ఉపయోగపడతాయి. పేడ ఎరువుకు మంచి డిమాండ్ ఉంది. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువులకు ఆయా ప్రాంతాల్లో మంచి రేటు పలుకుతోంది.

- హరీష్, రైతు, కరిగానిపల్లి

విషాదం నింపిన బస్సు ప్రమాదం



హేత్విక్



కేశవులురెడ్డి



తులసి(ఫైల్)

గంగమ్మ ఉత్సవాలకని వచ్చి.....

రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హొస్కొటె వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. వేర్వేరు పనుల మీద వచ్చిన వారు ప్రమాదంతో మృత్యువాత పడ్డారు. ప్రమాద మృతుల్లో ఒకరైన ప్రణతి తండ్రి ఒంటెల హరిబాబు స్వస్థలం రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లె. ఆర్మీలో ట్రైనింగ్ అధికారిగా బెంగళూరులో పనిచేస్తున్నాడు.స్వగ్రామంలో గంగమ్మకు జరిగే కుంభాల ఉత్సవాలకు కుటుంబంతో వచ్చిన హరిబాబు తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో చిన్న కుమార్తె ప్రణతి(5)ని కోల్పోయాడు.పెద్దకుమార్తె కాత్యాయని ఎడమకాలు విరిగిపోగా, రెండవ కుమార్తె మాధురి కుడిచెయ్యికి తీవ్రగాయమైంది.



ఆళ్లమడుగులో కేశవులురెడ్డి భార్య, పిల్లల రోదన

ఆళ్లమడుగులో విషాదం

వెదురుకుప్పం : బస్సు ప్రమాదంలో వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన ఓ నలభై రోజుల చిన్నారి సహా ఓ దినసరి కూలీ చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది కూలి పనులతో జీవనం సాగించే ఆళ్లమడుగుకు చెందిన కామసానికి కేశవులురెడ్డి(44) అతని తమ్ముడు కె.జనార్దన రెడ్డి(32), తమ్ముడి భార్య గిరిజ(22), తమ్ముడి కుమారులైన నలభై రోజుల వయసున్న హేత్విక్, జశ్విన్‌రెడ్డి(4), అమ్మ పాపమ్మ(62) గురువారం రాత్రి బెంగుళూరులోని పుట్టానహళ్లికి బయలుదేరారు.హొస్కోట దగ్గర ప్రమాదంలో కేశవులురెడ్డి(46), హేత్విక్ మృత్యుబడిలోకి చేరుకున్నారు. జనార్దన రెడ్డి, గిరిజ, జశ్విన్‌రెడ్డి, పాపమ్మ గాయపడ్డారు.గిరిజ పరిస్థితి విషమంగా ఉంది.

ఏకైక కుమార్తె మృతితో దిగ్భ్రాంతి

ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరుకు చెందిన మునిలక్ష్మి, రమేష్ దంపతుల ఏకైక కుమార్తె తనూజ అలియాస్ జి.తులసి(22) బీటెక్ పూర్తి చేసుకుంది.బెంగుళూరులో కంప్యూటర్ కోర్సు చేసేందుకు తన పినతండ్రి జి.సిద్ధయ్య(42)తో బస్సులో వెళుతూ ప్రమాదంలో మృతిచెందింది.తమకు దాపుగా ఉంటుందనుకున్న కుమార్తె రోడ్డు ప్రమాదం బారినపడి చనిపోవడాన్ని ఆమె తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. సాయంత్రం మృత దేహం స్వగ్రామానికి చేరుకుంది.



పుల్లూరులో తులసి తల్లి రోదన

థామస్ టీమ్ సేవలు

ప్రమాద సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సూచనలతో ఆయన అనుచరులు హరీష్‌యాదవ్, బోడిరెడ్డి సుధాకర రెడ్డి, దామోదరరెడ్డి తదితరులు బెంగళూరుకు చేరుకుని క్షతగాత్రులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో థామస్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.50లక్షల చొప్పున అందించాలని, గాయపడిన వారికి రూ.10లక్షలు తక్షణ సాయం అందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు.

పినతండ్రి కర్మక్రియలకొచ్చి...

గంగాధరనెల్లూరు : బస్సు ప్రమాదంలో మృతి చెందిన శారద (42) కుటుంబం బెంగళూరులో స్థిరపడ్డా ఆమె స్వస్థలం గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె పంచాయతీ మారేడుపల్లె. భర్త విశ్వనాధరెడ్డి, కుమారుడు తేజు, కుమార్తె తేజస్వినిలతో బెంగుళూరు సిటీలో శారద ఉంటోంది. శారద ఇండ్ల పనికి వెళుతుండగా, విశ్వనాధరెడ్డి తాపీమేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.మారేడుపల్లెలో పినతండ్రి కర్మక్రియలకు హాజరయ్యేందుకు శారద గురువారం ఉదయం స్వగ్రామానికి వచ్చింది. అదే రోజు రాత్రి బస్సులో బెంగళూరు వెళుతుండగా ప్రమాదానికి గురై మృతి చెందింది. ఇదే మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన టీడీపీ నేత మురగారెడ్డి కుమారుడు లక్ష్మీకరుణ కుమార్ రెడ్డి అలియాస్ వి.ఎల్.కె.కుమార్ రెడ్డి అలియాస్ డ్రైవర్ కర్ల చిత్తూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. గురువారం రాత్రి ఆయన నడుపుతున్న బస్సే హొస్కోట వద్ద ప్రమాదానికి గురైంది.తీవ్రగాయాల పాలైన ఆయన్ను శుక్రవారం అతని బంధువులు హొస్కోట ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యంకోసం బెంగుళూరు సిటీలోని అపోలో ఆస్పత్రికి తరలించారు.



శారద (ఫైల్)

బెల్లంపల్లి స్టేషన్‌లో రైళ్ల స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లకు తెలంగాణలోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ రద్దుచేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోని బాలార్షా-ఖాజీపేట్ సెక్షన్‌లోని బెల్లంపల్లి యార్డులో జరగనున్న ప్రీ నాన్ ఇంటర్లాకింగ్, నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా వివిధ తేదీల్లో పలు రైళ్లకు ఆ స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు తెలియజేశారు. హుబ్లీ-బనారస్ (నం. 07323) రైలును ఈ నెల 14, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం .07324)ను ఈనెల 17, 24 తేదీల్లో, గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 12591) రైలును 21వ తేదీన, జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 12976) రైలును 23, 25 తేదీల్లోనూ బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో నిలపడం లేదని మిగతా తేదీల్లో యథాతథంగా స్టాపింగ్ కొనసాగుతుందని తెలిపారు.

అదృష్టం ఎవరికో..?

- వజ్రాల కోసం అన్వేషణ ● గురువారం దొరికిన వజ్రం ? ● సందడిగా మారిన వజ్రకరూరు పరిసరాలు



వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు, సేకరించిన రాళ్లను చూసుకుంటున్న మహిళలు



వజ్రాలు వెతికేందుకు వచ్చిన వారి వాహనాలు

ఉరవకొండ/గుంతకల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తొలికరి చినుకులు తాకిన నేల పరిమళాలు వెదజల్లుతూ ఆహ్లాదాన్ని పంచుతుంది. కానీ వజ్రకరూరు ప్రాంతం మాత్రం సువాసనలతో పాటు తన పొత్తిళ్లలో దాగిన మేలిమి వజ్రాలను అందిస్తోంది. ప్రతి ఏటా తొలకరి మొదలైతే చాలు ఈ ప్రాంతం వజ్రాల అన్వేషకులతో సందడిగా మారుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ఓ వ్యక్తికి దాదాపు సుమారు 30 గ్రాముల బరువుండే వజ్రం దొరికిందంటూ సమాచారం దావానలంలా వ్యాపించింది. ఇంకేముంది శుక్రవారం ఉదయానికల్లా ఆటోలు, బైక్‌లపై చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల వారేకాదు దూర ప్రాంతాల నుంచి సైతం అన్వేషకులు వాలిపోయారు. స్థానిక ప్రజలతో పాటు బద్వేలు, గార్లదిన్నె, ఉరవకొండ, అనంతపురం, ప్రకాశం జిల్లా దొనకొండ, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రజలు తెల్లవారుజామునే టిఫిన్, భోజన కారియర్‌లతో వజ్రకరూరుకు చేరుకుంటున్నారు. వజ్రకరూరు శివారులోని పొలాల్లో మహిళలు, పురుషులు, వృద్ధులు, చిన్న పిల్లలు సైతం మెరుపు రాళ్ల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్వేషణ సాగిస్తున్నారు. వజ్రకరూరులో వర్షాలు కురిసిన సమయంలో వజ్రాలు లభ్యం కావడం సర్వసాధారణం. అనేక మందికి గతంలో విలువైన వజ్రాలు లభించి ఉండటంతో ఒక్క వజ్రం లభిస్తే చాలు మన జీవితాలు మారిపోతాయన్న ఆశతో చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రజలు ఆటోలు, కార్లలో వచ్చి వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. కొద్దిగా మెరుస్తూ వజ్రంలాగా కనిపించిన ప్రతి రాయిని సేకరిస్తున్నారు. కొందరు రోజుల తరబడి స్థానికంగా ఉంటూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక్కడ రూ.లక్ష మొదలుకొని రూ.20లక్షల విలువ చేసే వజ్రాలు లభిస్తున్నట్లు సమాచారం.

ఆశతో వచ్చాం: ఈశ్వరమ్మ, అనంతపురం



వర్షాలు కురిసిన సమయంలో వజ్రాలు దొరుకుతాయన్న ఆశతో అనంతపురం నుంచి వచ్చాం. రెండ్రోజుల నుంచి వెతుకుతున్నా దొరకలేదు. తెల్లటి రాళ్ల వంటివి దొరికాయి. వాటిని గుర్తించడం కష్టంగా ఉండటంతో వెళ్లి పోతున్నాం.

వజ్రం దొరికింది..!

గురువారం భారీ వర్షం కురియడంతో వజ్రాల కోసం వెతికే జనం గుంపులుగుంపులుగా వజ్రకరూరుకు వచ్చారు. ఒక వ్యక్తి బొటనవేలు గోరంత వెడల్పు ఉన్న వజ్రం దొరికిందని, పక్కవారు చూడటంతో అతడు తన పేరు, ఊరు ఎవరికీ తెలపకుండా వెళ్లిపోయాడంటూ శుక్రవారం అక్కడున్న అన్వేషకులు తెలిపారు. వజ్రం దొరికిన వ్యక్తి గురువారమే కర్నూలు జిల్లా పెరవలిలో అమ్మాడని, వజ్రాల వ్యాపారి ఎక్కడ దొరికిందని అడగ్గా వజ్రకరూరులోని పొలం పేరు తెలపడంతో ఆ వ్యాపారి తన పరిధిలో ఉన్న అన్వేషకులకు సమాచారమిచ్చి పంపినట్లు తెలిసింది. కర్నూలు జిల్లా నుంచే కాదు తిరుపతికి చెందిన వారు సైతం వజ్రకరూరుకు చేరుకుని పొలాల్లో వెతుకులాడటం కనిపించింది. గుంతకల్లు చెందిన సుంకన్న, తిరుపతికి చెందిన వెంకటేశులుతోపాటు మరికొందరు అన్వేషకులు గురువారం వజ్రం దొరికినట్లు రూఢీగా తెలిపారు.

అనంతపురం నుంచి వచ్చా



వజ్రాలు దొరుకుతాయని చెప్పడంతో అనంతపురం నుంచి రెండ్రోజుల కిందట ఇక్కడకు వచ్చాం. రెండ్రోజులుగా ఇక్కడే ఉన్నాం. తెల్లగా మెరిసేటి రాళ్లు మాత్రమే దొరికాయి. వజ్రం దొరకాలంటే అదృష్టం కూడా ఉండాలి. **- హనుమక్క, అనంతపురం**

తప్పిన పట్టు..!

భారీగా తగ్గిన మల్బరీ సాగు విస్తీర్ణం

నీరు, ప్రోత్సాహకాల కొరతతో కనుమరుగు

చెరువువాండ్లపల్లిలో సాగుచేసిన మల్బరీ



నల్లమాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్బరీ సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. గతంలో 18వందల ఎకరాల్లో ఉన్న సాగు ప్రస్తుతం వంద ఎకరాల్లో కూడా కనిపించడం లేదు. గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, ప్రకృతి విపత్తుల వల్ల నష్టాలు రావడంతో రైతులు మల్బరీ సాగును మానేశారు. మండలంలోని కుటాపల్లి గ్రామం లో 90శాతం మంది రైతులు పట్టు పురుగుల పెంపకం చేసేవారు. ఆ గ్రామంలోనే దాదాపు 30వేల నుంచి 40వేల మట్టి కొనుగోలు చేసేవారు. కర్ణాటక రాష్ట్రంలోని సిడ్లఘట్ట, చెదలపురం, ములబాగల్, రామ్‌నగర్, తమిళనాడులోని చెన్నపట్నం వెళ్లి మట్టిని తెచ్చుకుని పట్టుపురుగుల పెంచేవారు. అక్కడ నుంచి తెచ్చిన మట్టితో నాణ్యమైన దిగుబడులు వచ్చేవి. దీంతో సీబీ రకం వంద మట్టిని రూ. 8వేలు, బైవోల్టిన్ రకం రూ. 6వేలు వెచ్చించి తెచ్చుకునేవారు. దిగుబడి బాగా వస్తే సీబీ రకం వంద మట్టికి 90 కిలోలకు పైబడి, బైవోల్టిన్ రకం 80 కిలోలకు పైబడి పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యేవి. నాణ్యమైన గూళ్లకు మంచి ధర లభించేది. సీబీ రకానికి కిలో రూ.300 పైబడి, బైవోల్టిన్ రకానికి రూ. 600పైబడి ధర లభించేది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రకాన్ని బట్టి కిలోకు ఇంత చెప్పున ప్రోత్సాహకం అందించేది. అయితే రైతులు మంచి ధర వస్తుండటంతో కర్ణాటకలో విక్రయించేవారు. ఇలా గ్రామానికి ప్రతి నెలా రూ.50లక్షల దాకా ఆదాయం వచ్చేది.

గతించిన వైభవం

ప్రస్తుతం కుటాపల్లి గ్రామంలో మల్బరీ సాగు చేసే రైతులే కరువయ్యారు. బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడం, దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో గ్రామంలో ఐదేళ్ల నుంచి మల్బరీ పెంపకం పూర్తిగా కనుమరుగైంది. అలాగే వైసీపీ పాలనలో మల్బరీ రైతులకు ప్రోత్సాహకాలు కూడా కరువయ్యాయి. దీంతో రైతులు మల్బరీ సాగుకు స్వస్తి చెప్పారు. ప్రస్తుతం ఏ కొద్దిమంది రైతులు తప్ప ఎవరూ సాగు చేయడంలేదు. మండలంలోని పులగంపల్లి, ఎర్రచెరువుపల్లి, దొన్నికోట, చెరువువాండ్లపల్లి, వంకరకుంట, వేళ్లమద్ది గ్రామాల్లో అరకొరగా మల్బరీ సాగు చేస్తున్నారు.



రేషం పురుగులు మేపుతున్న దృశ్యం

గ్రామంలో మల్బరీ కనుమరుగు



మాగ్రామంలో గతంలో 30వేల నుంచి 40వేల మట్టిని మేపేవారు. భూగర్భజలాలు తగ్గిపోయి, నీరు అరకొరగా రావడంతో మల్బరీసాగుకు స్వస్తి చెప్పి, ఇతర పంటలు సాగుచేసుకుంటున్నాం. గ్రామంలో ప్రతి రైతు మల్బరీ సాగుచేసేవాడు. మంచి ఆదాయం వస్తుండేది. ప్రస్తుతం నీరు లేకపోవడం, ప్రభుత్వం నుంచి రాయితీలు రాకపోవడంతో గ్రామంలో మల్బరీ సాగు కనుమరుగైంది. ప్రభుత్వం రాయితీలు అందిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

- గన్‌రెడ్డి, రైతు, కుటాలపల్లి

ప్రోత్సాహకం ఇవ్వాలి



నేను రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. మంచి దిగుబడులు వస్తున్నాయి. పండించిన పట్టుగూళ్లకు కిలోకు ప్రభుత్వం రూ.50లు ఇన్సెంటివ్ ఇచ్చేది. గత ఆరేళ్ల నుంచి అది ఇవ్వడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా రైతులకు ఇన్సెంటివ్ ఇస్తే మరి కొంతమంది రైతులు మల్బరీ సాగుకు మొగ్గు చూపుతారు.

- ప్రభాకర్‌రెడ్డి, రైతు, పులగంపల్లి

నేడు దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా వేడుకలు: కలెక్టర్



అనంతపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దివ్యాంగులతో రాష్ట్రస్థాయి యోగా వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండులో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేలా దివ్యాంగులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ శనివారం ఉదయం 6-30గంటలకు పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకోవాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఈ వేడుకలకు ఆహ్వానించాలని సూచించారు. మైదానంలో ఎల్ఈడీ స్ర్కీన్స్, మొబైల్ టాయ్‌లెట్స్, మైకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి హాజరవుతున్న వారికి అల్పాహారం, తాగునీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మెడికల్ క్యాంపులు, 108 వాహనాలు అందుబాటులో ఉండాలని అన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ వినోద్, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

చైతన్య మహాప్రభు (వర్ధంతి)



శ్రీ చైతన్య మహాప్రభు 1846 ఫిబ్రవరి 18న పశ్చిమబెంగాల్ నవద్వీప్‌లో జన్మించారు. ఆయన జయంతిని 'గౌర పూర్ణిమ' (ఫాల్గుణ పౌర్ణమి)గా వ్యవహరిస్తారు. వల్లభాచార్యుడి సమకాలీకుడైన ఆయన 'రాధాకృష్ణ' సంప్రదాయాన్ని పరాకాష్ఠకు తీసుకెళ్లిన మహాభక్తుడు. 'హరే కృష్ణ' సంకీర్తనను విస్తృతం చేశారు. చైతన్య సంప్రదాయానికి చెందిన వేదాంతాన్ని 'అచింత్య భేదా భేదవాదం' అని అంటారు. మతపరంగా దీనికి 'గౌడీయ వైష్ణవం' అని కూడా పేరు. చైతన్యుడి జ్ఞాన మీమాంస, ధార్మిక బోధనలు పది ఉన్నాయి. వీటినే 'దశమూల బోధనలు'గా వ్యవహరిస్తారు. 1534 జూన్ 14న నిర్యాణం చెందారు.

బుచ్చిబాబు (జయంతి)



కలం పేరు 'బుచ్చిబాబు'గా పేరొందిన శివరాజు వెంకట సుబ్బారావు 1916 జూన్ 14న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జన్మించారు. చిన్న కథల రచయితగా, నవలా రచయితగా, చిత్రకారుడిగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందారు. ఇంగ్లీషు లెక్చరర్‌గా కెరీర్ ప్రారంభించారు. రెండు దశాబ్దాలపాటు కథలు, నాటికలు ఆలిండియా రేడియోలో ప్రసారమయ్యాయి. 'చివరకు మిగిలేది' నవల ఎంతో పేరొందింది. 1946-47లో నవోదయం పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైంది. మరణానంతరం సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించారు. 1967 సెప్టెంబరు 20న కన్నుమూశారు.

కాట్రగడ్డ మురారి (జయంతి)



కాట్రగడ్డ మురారి 1944 జూన్ 14న విజయవాడలో జన్మించారు. తెలుగు సినీ నిర్మాతగా పేరొందారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించి నిర్మాతగా ఎదిగారు. 'యువచిత్ర ఆర్ట్స్' ప్రొడక్షన్స్ కింద 1978-90లమధ్య 10 సినిమాలు నిర్మించారు. ఆయన సినిమాలకు ఎక్కువగా కేవీ మహదేవన్ సంగీతం అందించారు. గోరింటాకు, శ్రీనివాస కల్యాణం, నారీ నారీ నడుమ మురారి సినిమాలు ఆయనకు గుర్తింపు తెచ్చాయి. ప్రముఖ దర్శకులు కే విశ్వనాథ్, సింగీతం శ్రీనివాసరావు, దాసరి నారాయణరావు, జంధ్యాల, కోడిరామకృష్ణ, రాఘవేంద్రరావు వంటి వారితో సినిమాలు తీశారు. 2022 అక్టోబరు 15న కన్నుమూశారు.

డొనాల్డ్ ట్రంప్ (పుట్టినరోజు)



అమెరికా దేశ 47వ అధ్యక్షుడిగా కొనసాగుతున్న డొనాల్డ్ జాన్ ట్రంప్ 1946 జూన్ 14న జన్మించారు. వ్యాపారవేత్తగా, రాజకీయ నేత రాణించారు. మిలిటరీ, ప్రభుత్వ సర్వీసులు లేకుండా రిపబ్లికన్ పార్టీ తరపున ఎన్నికైన తొలినేత, 45 అమెరికా అధ్యక్షుడిగా 2017 నుంచి 2021 వరకు కొనసాగారు. అనంతరం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడి ఓటమి పాలయ్యారు. కాగా 1996 నుంచి 2015 వరకు మిస్ యూనివర్స్, మిస్ యూఎస్ఏ, మిస్ టీన్ యూఎస్ఏ పోటీలను ఆయన ప్రమోట్ చేశారు.

స్టెఫీగ్రాఫ్ (పుట్టినరోజు)



ప్రపంచంలో నెంబరు వన్ టెన్నిస్ మహిళా క్రీడాకారిణిగా పేరొందిన స్టెఫీగ్రాఫ్ 1969 జూన్ 14న జర్మనీలో జన్మించారు. పూర్తి పేరు స్టెఫాని మరియ గ్రాఫ్. టెన్నిస్‌లో ఏడేళ్లకుపైగా నెంబరు వన్ స్థానంలో కొనసాగారు. 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ అందుకున్నారు. ఒకే ఏడాదిలో నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఒలింపిక్‌లో గోల్డ్‌మెడల్ సాధించడం ద్వారా 'గోల్డెన్‌స్లామ్'ను 1988లో అందుకున్నారు. 30వ యేట 1999లో రిటైర్మెంట్ ప్రకటించారు. వరల్డ్ నెంబరు 1 టెన్నిస్ క్రీడాకారుడు అండ్రీ అగస్సీని పెళ్లి చేసుకున్నారు. 2004లో టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు దక్కించుకున్నారు. జర్మనీ దేశానికి చెందిన బోరిస్‌బెకర్‌తో కలసి టెన్నిస్ క్రీడ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు.

ప్రీతమ్ (పుట్టినరోజు)



ప్రీతమ్ చక్రబోర్తి 1971 జూన్ 14న బెంగాల్ రాష్ట్రం కోల్కత్తాలో జన్మించారు. స్వరకర్తగా, ఇన్‌స్ట్రుమెంటలిస్ట్, గిటార్ ప్లేయర్‌గా, సింగర్‌గా రాణించారు. ప్రముఖ బ్రాండ్‌లకు జింగిల్స్, సీరియల్స్‌కు టైటిల్ ట్రాక్స్ రూపొందించి బాలీవుడ్‌లోకి ప్రవేశించారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 'ధూమ్' సినిమా ఎంతో గుర్తింపు తెచ్చింది. పలు ఆల్బమ్స్‌కు సంగీతం అందించారు. సంగీత దర్శకుడిగా ఐఐఎఫ్ఏ అవార్డు, ఫిల్మ్‌ఫేర్ అవార్డు, ఏసియా పసిఫిక్ స్క్రీన్ అవార్డులు, మ్యూజిక్ మిర్చి, గ్లోబల్ ఇండియన్ మ్యూజిక్ అవార్డులు అందుకున్నారు.

నీటికుంటను తలపిస్తున్న రహదారి

అమరాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచికుంట గ్రామంలో వర్షం పడితే ప్రధాన రహదారి నీటి కుంటను తలపిస్తోందని గ్రామస్థులు అంటున్నారు. రహదారిలో వర్షకాలంలో రోడ్డుపై నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వారాల కొద్ది రహదారిపై నీరు నిలుస్తున్నాయని, దీంతో దోమలు, ఈగలతో కంపు కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ముదిరాజు, బీరలింగప్ప, నాగరాజు, చిక్కన్న, మంజునాథ్, రాజప్ప కోరారు.



మడుగును తలపిస్తున్న కాచికుంట గ్రామ రహదారి

రూ.2 కోట్లతో కొడతి అత్యాధునిక భవనం



కార్యాలయం నూతన భవనం వద్ద సభ్యులు, సిబ్బంది తదితరులు

దొమ్మసంద్ర, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సర్జాపుర మెయిన్‌రోడ్డులోని విప్రో సమీపాన ఆక్ర మణలు తొలగించి గ్రామపంచాయతీకి చెందిన రూ.2కోట్లతో అత్యాధునిక భవనాన్ని నిర్మించారు. పార్టీల బేధం లేకుండా సభ్యులందరితో కలసి గ్రామపంచాయతీ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు మంజునాథ్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండు ఎకరాల స్థలంలో 5వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్థులతో హైటెక్ హంగులతో భవనాన్ని నిర్మించినట్టు తెలిపారు. ఇందుకు పంచాయతీ ఉపాధ్యక్షులు, సభ్యులంతా సహరించారన్నారు. ఇదే సందర్భంగా పంచాయతీలో పనిచేసే సిబ్బంది ప్రతి ఒక్కరికీ తలా 25కేజీల బియ్యం, పురుషులకు ప్యాంటు, షర్టు, మహిళలకు చీరలు పంపిణీ చేసి జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. సమాజంలోని అట్ట డుగు వర్గంలోని వ్యక్తిని కూడా బలోపేతం చేయాలనే లక్ష్యంతో దివ్యాంగుల జీవనాధారం కోసం వాణిజ్య సంకీర్ణం (దుకాణాలు) నిర్మించను న్నట్టు తెలిపారు. కాగా గ్రామపంచాయతీ నూతన భవనం వెనుక గోడౌన్, ముందుభాగాన విలేజ్ అకౌంటెంట్‌ల కార్యాలయాన్ని నిర్మించేలా పథ కాన్ని రూపొందించినట్టు తెలిపారు. ఈ సంద ర్భంగా మాజీ మంత్రి హెచ్ నాగేశ్, కొడతి గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు కృష్ణవేణి, సభ్యులు నారాయణస్వామి (బాబు), సతీశ్ ఎం, కేఎన్ బాబురెడ్డి, ప్రముఖులు సదాశివరెడ్డి, కాం గ్రెస్ ప్రముఖులు సునిల్, పీడీఓ మురళీధర్, కార్యదర్శి నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో శ్రీవారి శీఘ్రదర్శనం

» టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు సన్మానం

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కృత్రిమమేధస్సు (ఏఐ) సాంకేతికతను అనుసంధానం చేసుకుని తిరుమలకొండపై శ్రీవారి దర్శనాన్ని మరింత శీఘ్రం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అభిప్రాయపడ్డారు. తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల పురస్కారాన్ని శుక్రవారం స్వీకరించాక ఆయన మాట్లాడారు. పాలకమండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక తిరుమల కొండపై ఎన్నో మార్పులు తీసుకొచ్చానన్నారు. కోట్లాదిమంది హిందువుల మనోభావాలకు అనుగుణంగా సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు కట్టుబడ్డానన్నారు. కర్ణాటక నుంచి ఏటా లక్షలాదిమంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారన్నారు. కార్యక్రమంలో యదుగిరి యతిరాజ మఠాధిపతి యతిరాజ జీయర్‌స్వామిజీ మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడే దిశగా కొత్తపాలకవర్గ నిర్ణయాలను అభినందించారు. యతిరాజమఠం తరఫున టీటీడీ చైర్మన్‌కు రామానుజశ్రీ సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు మాట్లాడుతూ తెలుగు విజ్ఞాన సమితి భవన నిర్మాణానికి 1978లో టీటీడీ బోర్డు అధ్యక్షుడిగా ఉన్న అన్నారావు అరలక్ష విరాళం ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్‌ను సత్కరించారు. సమితి ఉపాధ్యక్షులు గంగరాజు, ఆది కేశవులునాయుడు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి, కోశాధికారి వరదరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

శ్రవణ్ చదివిన పాఠశాలలో అన్నదానం

చింతామణి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్సీబీ విజయోత్సవాల వేళ చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాటలో మృతి చెందిన శ్రవణ్ జ్ఞాపకార్థం అతడు చదివిన కురుటహళ్ళి గ్రామంలోని సుమశ్రీ ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈనెల 4న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయోత్సవాలను వీక్షించేందుకు వెళ్లిన చిన్నస్వామిస్టేడియం వద్ద తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన విషయం విదితమే. వీరిలో చింతామణి తాలూకా కురుటహళ్ళికి చెందిన బెంగళూరు అంబేడ్కర్ డెంటల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న కేటీ శ్రవణ్ మృతి చెందాడు. శ్రవణ్ ప్రాథమిక హైస్కూల్ విద్యను స్వగ్రామం కురుటహళ్ళిలోని సుమశ్రీ ఇంగ్లిష్‌మీడియం స్కూల్‌లో చదివాడు. శ్రవణ్ జ్ఞాపకార్థం తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు కృష్ణప్ప, తండ్రి తిమ్మప్ప, తల్లి లక్ష్మీదేవమ్మ సహా కుటుంబీకులు పాల్గొని అన్నదానం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

పేద పిల్లలకు అండగా ఉండాలి



బాలకార్మిక వ్యతిరేకదినంలో న్యాయాధికారి మంజునాథాచారి తదితరులు

బాగేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన పేద పిల్లలు విద్యా వంచితులై బాలకార్మికులు అవుతున్నారని దీన్ని అరికట్టేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని తాలూకా న్యాయసేవల ప్రాధికార మెంబర్ సెక్రటరీ న్యాయాధికారి మంజునాథాచారి అభిప్రాయపడ్డారు. తాలూకా న్యాయసేవల సేవా సమితి, తాలూకా న్యాయవాదులసంఘం, తాలూకా కార్మికశాఖ, స్త్రీ శిశుసంక్షేమశాఖ విద్యాశాఖ, ఆరోగ్య, తదితరశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినంను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు, పేదరికం కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను కొన్నిచోట్ల విద్యకు దూరం చేసి పనులకు పంపుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. బాల కార్మికులు విద్య, శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లలందరిలో ప్రత్యేక సామర్థ్యం ఉంటుందని వారి హక్కులను అడ్డుకోవడం సరికాదన్నారు. పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపేలా ప్రోత్స హించాలన్నారు. న్యాయవాదులసంఘం అధ్యక్షుడు జయప్ప మాట్లాడుతూ కొన్ని హోటళ్లు, చిల్లర దుకాణాలు, చిన్న ఫ్యాక్టరీలలో పనుల కోసం తల్లిదండ్రులు పంపుతుంటారన్నారు. కావున కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేసి బాలకార్మికులు ఎవరైనా ఉంటే గుర్తించి వారిని మళ్లీ పాఠశాలలకు పంపేలా చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వవసతి పాఠశాలల్లో తగిన సదుపాయాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సీ రవి, వెంకట నారాయణ, బిందు కుమారి, నాగభూషణ, బాలునాయక్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



పర్యావరణ జాగృతిలో సివిల్ న్యాయాధికారి మహ్మద్ రోషన్‌షా తదితరులు

శిడ్లఘట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కనీసం 2-3 మొక్కలు నాటి వాటి పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా చక్కటి గాలి, నీడ సాధ్యమని సీనియర్ సివిల్ న్యాయాధికారి మహ్మద్‌రోషన్‌షా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు పెట్రోల్‌బంకు వెనుక ఆనూరు క్రాస్‌వద్ద నగరసభ ఉద్యానవనంలో మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం గణనీయంగా తగ్గించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్ న్యాయాధికారి సీఎస్ సుకన్య తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, తహసీల్దార్ బీఎస్ స్వామి, నగరసభ కమిషనర్ మోహన్, నగరసభ అధ్యక్షుడు ఎం వెంకటస్వామి, నగరసభ సభ్యులు అనిల్‌కుమార్, జబీర్, మౌల, నవీన్, అటవీ అధికారి రాజేశ్ గవల్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే దళితులు, రైతులకు న్యాయం

●ఆందోళన వేదిక అధ్యక్షుడు రాఘవేంద్ర కుష్టగి



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాఘవేంద్ర కుష్టగి

రాయచూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు, దళితులు ఏకమై సంఘటిత పోరాటం సాగిస్తేనే వారికి తగిన న్యాయం జరుగుతుందని హైదరాబాద్ కర్ణాటక జనాందోళన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేంద్ర కుష్టగి అన్నారు. దివంగత చన్నబసవప్ప పాటీల్ బెట్టదూర్ స్మారక ఉపన్యాసాన్ని శుక్రవారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ప్రధానోపన్యాసం చేసిన రాఘవేంద్ర కుష్టగి చన్నబసవప్ప పాటీల్ బెట్టదూర్ కేవలం అభ్యుదయ, కవి సాహితీవేత్తనే కాదు పోరాటాలను ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేసిన ధీమంత నాయకుడన్నారు. ఆయన కేవలం కవితలకు కార్యాలకే పరిమితం కాలేదని భవిషత్తు పోరాటంలో భాగస్వాములైయ్యేందుకు బసవ ప్రభు పాటీల్, అల్లమ ప్రభు పాటీల్, చామరస మాలిపాటీల్ వంటి ధీమంతులైన నాయకులను మనకు వారసులుగా అందించారన్నారు. కాగా ఈ ప్రాంత నాయకుల నిర్లక్ష్యం అసమర్థత వల్ల ఎన్ఆర్‌బీసీ, ఎస్ఎల్‌బీసీ నీటి లభ్యత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రాయచూరు జిల్లాలోని చివరి ఆయకట్టు రైతులకు నీరు అందని ద్రాక్షగా మారిందన్నారు. తుర్విహాళ్, సిరవార వంటి పైభాగంలోని కాలువకు అక్రమంగా పంప్ సెట్‌లు బిగించడం వల్లే దిగువకు నీరందడం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రశ్నించేందుకు వెళ్లిన రైతు సంఘం నాయకులు చామరస మాలిపాటీల్ పై అక్కడి రాజకీయ నాయకుల ప్రోత్సలంతో దాడులు జరిగే ప్రయత్నం చేయడం సిగ్గ చేటన్నారు. ఈ విషయంలో రైతులు వారితో పాటు అనేక వివక్షలు ఎదుర్కొంటున్న దళితులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో పాల్గొన్న మేలుకోటె ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలు పండించేందుకు రైతులు మార్పుతో సిద్ధం కావాలన్నారు. అదే సమయంలో తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

అమరాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామం పాత ఎస్సీ కాలనీలో తాగునీటి కొరత తీ వ్రంగా ఉంది. 15రోజుల నుంచి ట్యాంకరు ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నారు. సమస్యను శాసనసభ్యుడు ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కొత్తగా బోరును తవ్వించడంతో నీరు సమృద్ధిగా పడ్డాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, గొల్లమరనపల్లి రామచంద్రప్ప, మాజీ సర్పంచ్ కుమార్‌స్వామి, తిమ్మన్న గౌడ, రంగప్ప, నరసింహనాయక్, వార్డుమెంబర్ సిద్దేశ్వర, రంగజ్జ, గోపాల్, లింగరాజ్, ప్రభాకరచ, రమేష్, ఓబుల్‌రాజు పాల్గొన్నారు.

కోర్టులో లొంగిపోయిన ఎమ్మెల్యే కులకర్ణి

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ధారవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి శుక్రవారం బెంగళూరులోని ప్రజాప్రతినిధుల కోర్టులో లొంగిపోయారు. ధారవాడకు చెందిన జిల్లా పరిషత్ సభ్యుడు యోగేశ్‌గౌడ హత్యకేసులో వినయ్ కులకర్ణి నిందితుడిగా ఉన్నాడు. ఆయనకు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో సీబీఐ పిటీషన్ దాఖలు చేసిన మేరకు విచారణ జరిపిన ధర్మాసనం తీర్పునిచ్చింది. గత శుక్రవారం 6వ తేదీన బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు వారంరోజుల్లో లొంగిపోవాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగానే వినయ్ కులకర్ణి నేరుగా ప్రజాప్రతినిధుల కోర్టులో లొంగిపోయారు. కోర్టు సీబీఐకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అనంతరం వినయ్‌కులకర్ణిని పరప్పన అగ్రహార జైలుకు పంపారు.

ఇందిరానగర్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

బెంగళూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టోయో ఇంజనీరింగ్ కార్పొరేషన్, మోడెక్ సంస్థలు సంయుక్తంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను నగరంలోని ఇందిరానగర్‌లో లాంఛనంగా ఆవిష్కరించారు. టోయో జపాన్ సీఈఓ ప్రెసిడెంట్ ఎజి హొసాయ్, మోడెక్ సీఈఓ హిరోహికో మియాటాలు సంయుక్తంగా ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ నకానె సుటోములు పాల్గొన్నారు. ప్రస్తుతం ఓఎఫ్ఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 200మంది సిబ్బంది ఉన్నారని, రానున్న మూడేళ్లలో 750మంది సామర్థ్యం పెంచదలిచామన్నారు. టోయో ఇంజనీరింగ్, గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ విభాగాలలో అనుభవం ఉన్నది. 1961లో సంస్థ ప్రారంభమైంది. మోడెక్ కంపెనీ 1968లో ప్రారంభం కాగా గ్యాస్ ఇండస్ట్రీస్, ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ విభాగాలలో అనుభవం కలిగిందన్నారు.

పౌర ఆహార సరఫరాల శాఖ దాడులు



స్వాధీనం చేసుకున్న గ్యాస్‌సిలిండర్లు

శిడ్లఘట్ట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాపౌర ఆహార సరఫరాలశాఖ జాయింట్ డైరెక్టర్ సూచన మేరకు తాలూకా వినియోగదారులశాఖ అధికారులు పట్టణంలో పలుచోట్ల దాడులు నిర్వహించింది. ఇళ్లకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌లను వాణిజ్య వినియోగాలకోసం అక్రమంగా విక్రయిస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పలు టీషాప్, చికెన్ దుకాణాలలో మొత్తం 13 అక్రమ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆహార సరఫరాలశాఖ అధికారి ప్రకాశ్ నేతృత్వంలో దాడులు కొనసాగాయి.

తల్లీబిడ్డలను రక్షించిన అధికారులు



కార్యాచరణలో పాల్గొన్న అధికారులు

ముళబాగిలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హాలోబ్లాక్ ఫ్యాక్టరీలో గృహ నిర్బంధం చేసిన తల్లీబిడ్డలను తహసీల్దార్ రక్షించారు. పనికోసం చేరిన భార్యాభర్తలచేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు. సద్దాం హుస్సేన్ ఏడేళ్లుగా గృహనిర్బంధం చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల భర్త ప్రశాంత్, భార్య బిడ్డలను వదిలి పరారయ్యాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ముళబాగిలు తహసీల్దారు గీతా, జిల్లా జాగృతి సమితి సభ్యులు రక్షించారు. తాలూకాలోని హనుమనహళ్ళిక్రాస్‌లో మూన్‌లైట్ హాలోబ్రిక్స్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ తల్లీబిడ్డను గృహనిర్బంధం చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల భార్యా, బిడ్డను వీడి ప్రశాంత్ పరారయ్యాడు. ఎట్టకేలకు ఫిర్యాదు మేరకు ముళబాగిలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా తహసీల్దార్ నేతృత్వంలో తల్లీబిడ్డను విడిపించారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు గాయపడగా, పాడి ఆవు మృతి చెందింది. మండలంలోని 544-ఈ జాతీయ రహదారిలో వడ్డిచెన్నంపల్లి వద్ద రోడ్డు పక్కన మేత మేస్తున్న పాడి అవును, అక్కడే ఉన్న అజయ్ అనే వ్యక్తిని హిందూపురం వైపు నుంచి వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. పాడి అవు మృతిచెందగా, వడ్డిచెన్నంపల్లికి చెందిన అజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడున్న వారు అతనిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన పాడి ఆవు వడ్డిపల్లిచెన్నంపల్లికి చెందిన పెద్దింటి గుడిబండప్పకు చెందినదిగా గుర్తించారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1602.96	1,582.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	8,269	3,533
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	92	10
నీటి నిల్వ (టీఎంసీలు)	25.59	5.59

రాజకీయ చిక్కుల్లో మేయర్ ఎన్నికలు..!

● హుబ్లీ-ధార్వాడ రిజర్వేషన్లు మార్చాలని కోర్టుకు వెళ్లిన కార్పొరేటర్లు ● ఈ నెల 24న ముగియనున్న బళ్లారి మేయర్ గడువు



బళ్లారి మహనగర పాలికె కార్యాలయం

బళ్లారి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పది మహనగర పాలికె మేయర్, ఉప మేయర్, పది మంది కమిటీ సభ్యుల ఎన్నిక అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. బళ్లారి మేయర్ కాలపరిమితి ఈనెల 23తో ముగియనుంది. ఇక 24వ అవధి మేయర్, ఉపమేయర్ ఎన్నిక ఇదే నెల 21 నుంచి ఎన్నికల జరగాల్సి ఉంది. రాష్ట్రంలో బళ్లారి, బెళగావి, దావనగెర, హుబ్లీ-ధావణగెరె, కలబురగి, మంగళూరు, మైసూరు, శివమొగ్గ, తుమకూరు, విజయాపురం మహనగర పాలికెలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఇతర కమిటీ సభ్యుల అధికార గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో వీటికి తిరిగి ఎన్నిక జరగాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన అనెక్సర్ జే ప్రకారం చూస్తే ఒకలా మేయర్ రిజర్వేషన్లు, అనెక్సర్ ఎఫ్ ప్రకారం మరోలా రిజర్వేషన్ ఉండడంతో హుబ్లి-ధార్వాడ లో నాగరాజు డి. శివప్ప అనే కార్పొరేటర్ ధార్వాడ కోర్టులో పిటిషన్ వేశారు. మేయర్ పదవి బీసీబి కి ఉంటే దాన్ని జనరల్ కేటగిరీకి మార్చారని ఉప మేయర్ స్థానానికి ఓబీసీ మహిళ ఉంటే వాటిని జనరల్ కేటగిరీ కింద మార్చారని వీరు ఫిర్యాదు చేశారు. అలాగే బళ్లారి మేయర్, ఉప మేయర్ ఎన్నికలో కూడా ఏ విధానం అమలు చేయాలి .. అని కమిసన్ ఖలీల్ ప్రభుత్వానికి లేఖ రాశారు. అనెక్సర్ జే ప్రకారం అయితే బళ్లారి మేయర్ పదవి జనరల్‌కు ఉప మేయర్ జనరల్ మహిళకు రిజర్వేషన్ అయ్యింది. 2022లో అప్పుడు అధికారంలో ఉన్న ఓ బీజేపీ నాయకుడు మేయర్ పదవి రిజర్వేషన్ మార్చారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీని ప్రకారం అయితే రాష్ట్రంలో ఉండే పది మహనగర పాలికె లో మేయర్ పదవి రిజర్వేషన్ ఒక్కటి మారినా మిగిలినవి కూడా మార్చాల్సి వస్తుందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మహనగర పాలికెల్లో బళ్లారి మాత్రం కాంగ్రెస్ మేయర్, ఉప మేయర్ ఉన్నారు. దీన్ని అధికార కాంగ్రెస్ ఎలా కాపాడుకుంటుంది? అనేది వేచి చూడాల్సిందే.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన సన్నాహాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జూన్ 21న నగరంలోని శ్రెట్ర గురుశాంతప్ప కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవాలని, దీనిని అర్థవంతంగా జరుపుకోవడానికి వివిధ విభాగాల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. వర్షాకాలం దృష్ట్యా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వైపు కృషి చేయాలన్నారు. ఉదయం 7గంటల నుంచి యోగా కార్యక్రమం చేపట్టాలన్నారు. తరువాత యోగా వేదిక కార్యక్రమం ఉంటుంది. వేదిక, ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. జిల్లాస్థాయిలో జరిగే కార్యక్రమానికి ఎక్కువ మంది వచ్చేలా ప్రచారం నిర్వహించాలని . పతంజలి యోగా సెంటర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహా యోగా కేంద్రాలు తప్పని సరిగా సహకరించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, హాస్టళ్లలోని విద్యార్థులు యోగా కార్ర్యమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన విద్యాశాఖ అధికారులను , సాంఘిక సంక్షేమ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. తగినన్ని తాగునీరు, ఆహార ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యం కలిగిన యోగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. జిల్లాఆయుష్ అధికారి డాక్టర్ విరూపాక్ష మాట్లాడుతూ ఈ సంవత్సరం కార్యక్రమాన్ని 'ఒకే భూమికి, ఒకే ఆరోగ్యానికియోగా ' అనే నినాదంతో జరుపుకుంటామన్నారు. ఈసందర్భంగా ఆహార పౌర సరఫరాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సకీనా, స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ శాఖ డైరెక్టర్ విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున,షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి దివాకర్, జిల్లాలోని వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు, వివిధ కేంద్రాల ప్రతినిదులు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి పుష్పాలంకరణ

సిరుగుప్ప, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలిసిన తాయమ్మదేవికి ఘనంగా శుక్రవారం పూజలు జరిగాయి. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి ప్రధాన అర్చకులు శ్రీనివాసులు పుష్పాలంకార సేవలు నిర్వహించారు. మహా మంగళహారతి చేపట్టారు. పుష్పార్చన, ప్రసాద పంపిణీ చేశారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



పుష్పాలంకరణలో తాయమ్మదేవి

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

● ధ్రువీకరించిన విత్తనాలనే సాగుకు ఉపయోగించాలి : రైతు మేళా ప్రారంభోత్సవంలో కలెక్టర్ మిశ్రా

బళ్లారి సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులు నేల సారాన్ని బట్టి శాస్త్రీయ పంట పద్దతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి, జిల్లా పరిపాలన, జిల్లాపంచాయతీ, వ్యవసాయ, ఉద్యానవనశాఖ, వ్యవసాయ పనిముట్ల సంఘం, ఏపీఎంసీ వ్యాపారుల సంఘం, పత్తి పెంచే రైతుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారి వాణిజ్య , పరిశ్రమల ఆవరణలో మండలి నిర్వహించిన రైతు మేళా'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దూర దృష్టితో కూడిన రైతు మేళా నిర్వహించడం అభినందనీయమని రైతులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బళ్లారి వాణిజ్య , పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ రైతులు లేకుండా, వ్యవసాయం లేకుండా పరిశ్రమలు , వ్యాపారాలు లేవన్నారు. తమ సంస్థ దేశానికి వెన్నెముక అయిన రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు శాస్త్రీయంగా ధృవీకరించబడిన విత్తనాలను ఎంచుకుని అధిక దిగుబడి పొందడానికి శాస్త్రీయ పద్దతిలో పంటలను పండించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సోమసుందర్, ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ సంతోష్ సప్పంగి పేర్కొన్నారు. అనంతరం వారు రైతులకు వివిధ ప్రభుత్వ పథకాల గురించి సమాచారాన్ని అందించారు. ఈసందర్భంగా బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు శ్రీనివాసరావు, బళ్లారి ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టేమణి నాగేంద్ర, కార్యదర్శి శ్రీహరి, బళ్లారి జిల్లా పత్తి సంఘం అధ్యక్షుడు దండిన తిప్పేస్వామి, బీడీసీసీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్, కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ పనిముట్ల డీలర్ల సంఘం జిల్లా యూనిట్ అధ్యక్షుడు తిమ్మనగౌడ, మహారుద్రగౌడ, హగరి వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ రవి శంకర్, వ్యవసాయ డీలర్ల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చౌహాన్, ఏపీఎంసీ బ్రోకర్ల సంఘం అధ్యక్షుడు చిదానందప్ప, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తు్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

పరిశుభ్రతతోనే డెంగీ నివారణ సాధ్యం: డీహెచ్ఓ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): డెంగీని నియంత్రించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్య ఇవ్వాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు అన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్వా వ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయులకు డెంగీ నియంత్రణపై శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా పరిపాలన, జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా కరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 41పాఠశాలల సైన్స్ నోడల్ ఉపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అన్ని పాఠశాలల్లోనూ నీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేసి మూతలు మూసివేయాలని, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని బస్సుల టైర్లను పారవేయాలన్నారు. ఎక్కువ అవగాహన కల్పించడానికి ఆరోగ్య శాఖ తయారు చేసిన వీడియోలను స్మార్ట్ తరగతుల ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు చూపించాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు విజృంభించడంతో, దోమ కాటుద్వారా చికున్‌గున్యా, మలేరియా, ఎలిఫెంటీయాసిస్, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పాఠశాలలను సందర్శించే వైద్య బృందం ఇచ్చే సలహాలను తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో రక్తపరీక్షల ద్వారా మలేరియా , డెంగీ నిర్ధారణకు తగిన ఏర్పాట్లు చేయాలని, అలాగే ప్లేట్‌లెట్స్ , సీబీసీ, హెచ్‌బీమొదలైన వాటికి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్, డాక్టర్ బాలాజీ, జిల్లాఆరోగ్య విద్య అధికారి ఈశ్వర దాసప్ప, ఫీల్డ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ ఖాసీం, హెల్త్ ఇన్స్పెక్టర్ వెంకప్ప, పాఠశాల ఉపాధ్యాయులు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అధికారులు , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు పనులు

సిరుగుప్ప, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రూ.60 లక్షల వ్యయంతో సీసీ, డ్రైనేజీ నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సిరుగుప్ప పట్టణం 18వ వార్డు డ్రైవర్స్ కాలనీలో కేకేఆర్డీజీ నిధుల కింద సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను నర్రా సతీష్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. చాలా రోజుల నుంచి ఈ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో సతమతమవుతున్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



పూర్తయిన పనులు



ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పాలికె కాంప్లెక్స్ కూల్చడం అన్యాయం

● వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి
● రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ చర్యలు
● మాజీ మంత్రి శ్రీరాములు ఆగ్రహం

బళ్లారి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని బెంగళూరు రోడ్డు నటరాజ్ థియేటర్ ఎదురుగా ఉండే మహనగర పాలికె కు సంబంధించి ఉన్న పురాతన షాపింగ్ కాంప్లెక్స్‌లు కూల్చేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవడం సరికాదని , దీని వల్ల ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఇబ్బంది పడతారని బీజేపీ మండిపడింది. పాలికె నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం కాంగ్రెస్ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బుడా మాజీ అధ్యక్షుడు పి. పాలన్న, కార్పొరేటర్ శ్రీనివాస్ మోత్కర్, బీజేపీ కార్యకర్తలు, వ్యాపారులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే షాపుల నిర్వాహకులను బయటకు పంపుతున్నారని ఆరోపించారు. అధికారులు నిర్ణయం మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పనుల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. 34, 36 వార్డుల్లో పలు నూతన పనులకు ఆయన భూమిపూజ చేశారు. పలు వార్డులు లింక్ రోడ్లకు కోట్ల వీధిలో సీసీ రోడ్డు డ్రైనేజీతో పాటు నగర అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మించు శ్రీనివాస్, ప్రభంజన్‌కుమార్, జబ్బర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీదును ప్రారంభించిన ఎమ్మెల్యే



ముస్లిం నాయకులతో ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కురువళ్లి గ్రామంలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన జామియా మసీదును ఎమ్మెల్యే బీఎం నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు అల్లాను ఎంతో భక్తిశ్రద్దలతో కొలుస్తారని, వారి ప్రార్థనల నిమిత్తం మసీదు నిర్మించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు రామస్వామి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

'తల్లికి వందనం' డబ్బు పడనివారు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బులు పడని తల్లులు ఈనెలాఖరులోగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్ కోరారు. శుక్రవారం అమ్మకు వందనం మంజూరైన జాబితాలను ఉంచిన సచివాలయాలను నాయకులు పరిశీలించారు. జాబితాలో డబ్బులు పడనివారి లబ్ధిదారుల లిస్టును పరిశీలించి అలాంటివారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. నాయకులు శ్రీరాములు, రమణమ్మ, సుబ్రహ్మణ్యం, పులగూర్ల శ్రీనివాసులు, నంజుండ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ,ఎస్టీ, సన్నచిన్నకారు రైతులు నీటి పొరుదలతోపాటు డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా పండ్లు, పూలచెట్ల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఉపాధి పథకం కింద మండలానికి 200 ఎకరాలు పండ్లతోటలకు మంజూరు చేశారన్నారు. పండ్లచెట్లు, పూల మొక్కలు 19 రకాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నా రు. రైతులు సొంతంగా తెచ్చుకుంటే ఆ మొత్తం చెల్లిస్తుందన్నారు. ఇందుకోసం గుంతల తవ్వకం మొదలు, నీటి సరఫరా, నిర్వాహణ తదితర పనులకోసం మూడేళ్లపాటు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్నారు.

విజయనగరం జిల్లాలో ఆగని వర్షాలు



కుప్పకూలిన ఇల్లు

బళ్లారి సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హొసపేటలోని కొల్‌పేటలోని ఒక ఇల్లు కూలిపోయింది. కమలాపురం సరస్సు పొంగిపొర్లింది. పలు చోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కౌల్ పేటలోని సులేమాన్‌కు చెందిన మట్టి ఇల్లు కూలబడింది. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో వున్న విలువైన వస్తువులన్నీ ధ్వంసమయ్యాయి. దీంతో ఆ కుటుంబం ఒక్కసారిగా వీధిన పడింది. రెవెన్యూ అధికారులు సంఘటనాస్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కమలాపురం చెరువు పొంగి పొర్లడంతో సమీపంలోని పొలాలు, కుంటలు, కాలవల్లోకి నీరు వేగంగా ప్రవహించింది. దీని వలన విజయవిఠల ఆలయానికి వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నటర శివార్లలోని రాయరకెరె(రాయలచెరువు) ప్రాంతంలో వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. నగరంలోని పర్యాటక ఆకర్షణ ప్రాంతంలో 6సెంమీ వర్షం పడగా గాదిగనూరులో 2.5సెంమీ వర్షం కురిసింది. పాఠశాలలకు స్వచ్ఛంద సెలవు ప్రకటించారు. 1నుంచి 4వరకు కేజీ తరగతుల పిల్లలకు స్వచ్ఛంద సెలవు ఇచ్చారు.

నాలుగు టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటు

వర్ష సంబందిత నష్ట నివారణ ,ఇతర అత్యవసర పనుల కోసం నగరంలో నాలుగు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో వాహనాలు, అవసరమైన పరికరాలతో 10మంది ఉంటారు. ఈవిధంగా మొత్తం 40మంది అత్యవసర పనుల కోసం 24/7 అందుబాటులో ఉంటారని మున్సిపల్ కమిషనర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

హోసూరు జోన్

ఏనుగుల దాడులను నియంత్రించాలి



కరపత్రాలతో రైతుసంఘం సభ్యులు

కృష్ణగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని గ్రామాలలో ఏనుగుల దాడులు నియంత్రించాలని తమిళనాడు రైతుసంఘం డిమాండ్ చేసింది. ఏనుగుల దాడుల కారణంగా తరచూ పంట పొలాలు దెబ్బతింటున్నాయని, తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. సరిహద్దులోని కలివికోల్‌లో రైతుసంఘం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జులై 5న రైతు దినోత్సవ ర్యాలీ నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్ అధ్యక్షత వహించగా మహిళా విభాగం అధ్యక్షురాలు పెరుమ, యువజన విభాగం కార్యదర్శి అనుమంతరసు, తిరుమూర్తి తదితరులు పాల్గొన్నారు. కలివికోల్ ప్రాంతంలో 12 ఏనుగుల సంచారంతో సమస్యలున్నాయని పరిష్కరించాలని కోరారు.

పటాలమ్మ ఆలయంలో విశేష పూజలు

హోసూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని పటాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. సరిహద్దులోని ఆనేకల్ తాలూకా అత్తిబెలె గ్రామంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెరలూరు, చందాపుర, ఎప్పకోడి, మాయసంద్ర, సర్జాపుర, అత్తిబెలె సహా హోసూరు తదితర ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని వెండికిరీటం, గాజులు, పుష్పాలతో అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో అమ్మవారు

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హోసూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షం కురవడంతో కెలవరపల్లి డ్యాంకు ఇన్‌ఫ్లో పెరిగింది. 657 క్యూసెక్కుల నీరు వస్తుండగా, గురువారం 5 గేట్లద్వారా 981 క్యూసెక్కుల నీటిని తెన్‌పెన్నై నదిలోకి విడుదల చేశారు. మొత్తం సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 40.76 అడుగుల నీరు నిల్వ ఉంది. డ్యాం నుంచి నీరు విడుదల అవుతుండగా భారీ ప్రమాణంలో నురుగు వస్తుండడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. రసాయన కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డ్యాం నుంచి వస్తున్న నీరు

భారత్ మాలా రోడ్డు పనులు పరిశీలించిన ఎంపీ



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొనసాగుతున్న చైన్నై-సూరత్ భారత్ మాలా రోడ్డు పనులను శుక్రవారం రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ పరిశీలించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో కలిసి రోడ్లను పరిశీలించిన ఎంపీ భారతమాలా నిర్మాణంలో భాగంగా జరుగుతున్న ప్యాకేజీ-1,4 పనులు తన లోకసభ పరిధిలో కొనసాగుతున్నందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అదే సమయంలో ఇప్పటికే పూర్తైన రోడ్ల నిర్మాణాల్లో కొన్ని చోట్ల పగుళ్లు సంభవించిన నేపథ్యంలో వాటి పునర్నిర్మాణం పై దృష్టి సారించాలన్నారు. అదే సమయంలో రోడ్డు క్రాసింగ్ వద్ద వంతెనలు ఇతరత్ర పనులను వేగవంతంగా పూర్తి చేసి రోడ్డును వాహనదారులకు సౌకర్యవంతం చేయాలన్నారు. అనంతరం అధికారులతో సమావేశమైన ఎంపీ పనుల నిర్వహణకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాయచూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగర సమీపం యరమరస్ వద్ద శుక్రవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభించింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడికి చేరుకున్నారు. రాయచూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వ్యక్తి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి ఎవ్వరన్నదాని పై స్పష్టత లేదని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యరమరస్ సమీపంలోని కృష్ణమ్ రాజు క్లబ్ సమీపంలో పడి ఉన్న మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం శవాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

